క్లుప్తంగా

నేడు బస్టాండు ప్రారంభోత్సవం



అమరచింత: ప్రయాణికుల సౌకర్యార్థం నాగల్ కడ్మూర్‌లో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన బస్టాండ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు సర్పంచ్ రామేశ్వరమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రూ.మూడు లక్షలతో మినీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే మంజూరు చేశారని వారు తెలిపారు. వీటితో పాటు రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రహదారుల పనులకు భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు భీమా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో పాఠశాలలోని 100మంది బాలికలు సందేశాత్మక రంగవల్లులతో తెలుగువారి సంస్కృతిని చాటే విధంగా ముగ్గులు వేశారు. ఈ ముగ్గులను మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుకేశిని, ప్రసన్న పరిశీలించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, కౌన్సిలర్లు సంధ్య, పద్మ, ఖాజా, సీడీసీ మాజీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుజాత, వసీంఖాన్, అయ్యన్న, మార్కెట్ యార్డు కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సామర్థ్యాలు పెంచేలా బోధన సాగాలి



పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని అన్నారం, అన్నారంతండా ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలన్నారు. దీంతో పాటు మన ఊరు–మన బడి అభివృద్ధి పనుల్లో భాగంగా అన్నారం ప్రాథమిక పాఠశాలలో పనులు వంద శాతం పూర్తి చేయడంతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాములు, రంగానాయక్, హెచ్‌ఎంలు రాధ, చెన్నమ్మ పాల్గొన్నారు.

శబరిమలకు మాలధారులు



అమరచింత: కఠిన నియమ నిష్టలతో దీక్ష చేపట్టిన యాభై మంది మాలధారులు గురువారం ఇరుముడి కట్టుకొని శబరిమలకు తరలి వెళ్లారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి మాకం నర్సింహులు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజ చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఇరుముడులతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు క్యామ భాస్కర్, మ్యాడం కృష్ణయ్య, వెంకటేష్, అంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మదనాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లకు రక్షణ కల్పించి, హక్కుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. గురువారం మదనాపురం ప్రాథమిక ఆస్పత్రి వద్ద ఆశా కార్యకర్తలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డాక్టర్ మమతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు అనసూయ, కార్యదర్శి నీలమ్మ, సుజాత, గౌరీ, గంగా, జ్యోతి, మౌలానాబీ, భాగ్యలక్ష్మి, భాగ్యరాణి, యశోద, సుభాషిని, కావేరి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం నిరసన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తరగతులు సరే.. అల్పాహారం ఏదీ?

- అర్ధాకలితో ప్రత్యేక తరగతులకు పది విద్యార్థులు
- దాతలు స్పందించాలంటున్న తల్లిదండ్రులు



పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతిలో విద్యార్థులు (ఫైల్)

పాన్‌గల్: పదిలో విద్యార్థులు మంచి గ్రేడ్ సాధించాలని విద్యాశాఖ అధికారులు డిసెంబర్ 1 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తరచూ పరీక్షలు నిర్వహిస్తూ వెనకబడిన పిల్లలపై శ్రద్ధ చూపుతున్నారు. ఇదే సమయంలో విద్యార్థులు అర్ధాకలితో అవస్థపడాల్సి వస్తోంది. ఈ ప్రభావం చదువుపై పడుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఆకలి కారణంగా విద్యార్థులకు చదువులు ఒంటపట్టని పరిస్థితి నెలకొంది. దీంతో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి ప్రత్యేక తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో ఎక్కువ మంది పేద విద్యార్థులే ఉండడంతో ఉదయం ప్రత్యేక తరగతులకు ఖాళీ కడుపుతో వచ్చి మధ్యాహ్నం భోజనం వరకు ఆకలితో ఉండాల్సి వస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి సమీపం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలకు రావడానికి కనీసం రవాణా సదుపాయం కూడా ఉండకపోవడంతో చాలా మంది కాలినడకనే రావాల్సి వస్తోంది. ఆకలితో పాటు అలసట కూడా వారిని మరింత ఇబ్బంది పెడుతుంది.

దాతలు ముందుకొస్తేనే..

డిసెంబర్ ఒకటి నుంచి ఉదయం 8.45 నుంచి 9.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పాన్‌గల్	11	370
చిన్నంబావి	10	185
వీపనగండ్ల	08	170

అధిక శాతం పిల్లలు ఉదయం తినకుండానే కనీసం 6 కి.మీ. దూరం నుంచి వస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో సరిపుచ్చుకోవాల్సి వస్తోంది. కరోనాకు ముందు కొన్ని పాఠశాలల్లో దాతల సాయంతో అల్పాహారం అందించారు. ఈ సారి కూడా దాతలు స్పందిస్తే విద్యార్థులకు అల్పాహారం లభించే అవకాశాలున్నాయని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు. ఆకలితో కొన్ని పాఠశాలల్లోని విద్యార్థులు ఒక్కపూటనే తరగతులకు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక తరగతుల నిర్వహణకు అదనపు నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

ఏకాగ్రత తగ్గుతోంది



ప్రతి రోజు అన్నారంతండా నుంచి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు ఉదయం 7.30 గంటలకే ఇంటి నుంచి బయలుదేరి బస్సులో పాఠశాలకు చేరుకుంటాను. ఉదయం ఇంటి వద్ద వంట కాకపోవడంతో తినకుండానే పాఠశాలకు రావాల్సి వస్తుంది. తినకుండా రావడంతో చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది. దీంతో దాతలు స్పందించి అల్పాహారం అందిస్తే విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవచ్చు.

– అనిత, 10వ తరగతి, బాలుర ఉన్నత పాఠశాల, పాన్‌గల్

అలసటతో ఇంటికి



వీపనగండ్ల మండలం వల్లభాపూర్ నుంచి 6 కి.మీ. దూరంలో ఉన్న కేతేపల్లి పాఠశాలకు రావాలంటే బస్సులు లేక ఇబ్బందిగా ఉంది. దీంతో గ్రామం నుంచి క్రాస్ రోడ్డు వరకు 4 కి.మీ. కాలినడనే రావాలి. ఇందుకోసం ఇంటి నుంచి ఉదయం 7 గంటలకే బయలుదేరుతున్నాను. మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో అలమటించాల్సి వస్తోంది.

– ఝాన్సీ, ఉన్నత పాఠశాల, కేతేపల్లి

దాతలు స్పందిస్తే మేలు



పది ప్రత్యేక తరగతుల విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు స్పందిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది. అల్పాహారం అందించే విషయంపై ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, దాతలకు మరోమారు అవగాహన కల్పించి పది ప్రత్యేక తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేలా తగు చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ,

బస్సులు నడపాలంటూ రాస్తారోకో



అమరచింత: పాఠశాల, కళాశాల సమయానికి ఆర్టీసీ అధికారులు బస్సులను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అమచింత బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ మాట్లాడుతూ కొన్ని రోజులుగా మరికల్ నుంచి ఆత్మకూర్, ఆత్మకూర్ నుంచి నర్వ మండల కేంద్రాలకు ఆర్టీసీ షటిల్ సర్వీస్‌లు నిలిపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ పాఠశాల, కళాశాలలకు వెళ్తున్న పరిస్థితులు దాపరించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మకూర్, అమరచింత మండల కేంద్రాలకు ఇతర గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారని, సమయానికి బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నిలిపి వేసిన నర్వ షటిల్ సర్వీస్‌ను కొనసాగించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు అక్బర్, సాయి ఆశోక్, బాస్కర్, మహేష్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

సగరుల అభ్యున్నతికి కృషి



బుచ్చన్న



బాలశివుడు

కొత్తకోట: మండల సగర (ఉప్పర) సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతులపల్లి బుచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా పోతులపల్లి బాలశివుడు, గౌరవ అధ్యక్షుడిగా ఎస్పీ కురుమూర్తి, కోశాధికారిగా పోతులపల్లి రాములు, ఉపాధ్యక్షులుగా పి.అంజన్న, అస్కని శ్రీనివాసులు, పి.జనార్దన్‌గౌడ్, పి.నరేందర్‌సాగర్, చీర్ల యాదయ్యసాగర్, కార్యదర్శులుగా పి.కురుమూర్తి, గార్లపాటి కొండన్న ను నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. భగీరథుడి వంశస్థులు అయిన సగరులు అన్ని రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా తమ కులవృత్తి అయిన భవన నిర్మాణ రంగంలో ఉన్నారని, ఆర్థికంగా వెనుకబడిన సగరులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని ఆయన కోరారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సగరుల పాత్ర ఎంతో కీలకంగా ఉందని, వారికి సగర బంధు పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో విద్యార్థుల్లో సృజనాత్మకత



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న మేఘారెడ్డి

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందని ఎంపీపీ మేఘారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మనిగిల్ల జెడ్పీహెచ్‌లో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా ఇండియా లిటరసీ ప్రోగ్రాం ఆర్గనైజర్ రవిమణి హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో 15 గణిత, 15 ఇతర నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. బెలూన్ రాకెట్, బాటిల్ రాకెట్, ప్యారాచూట్, డీజే సిస్టం, ఇంధన వాయువులు, విద్యుత్ వలయాలు, హైడ్రాలిక్ సిస్టం, సౌరకుటుంబం, హోలోగ్రామ్ వీడియోలు, 3డీ స్క్రీన్, గుండె, మెదడు నమూనాలు, అమ్లక్షార ప్రయోగాలు వంటి ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచి, వారి ఆలోచనలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వైజ్ఞానిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్, సర్పంచ్ సరిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, ఆర్పీఎస్ జిల్లా సభ్యులు చిన్నమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం

కొత్తకోట: విద్యార్థులపై సేవా దృక్పథం కలిగి ఉండటం హర్షనీయమని కొత్తకోట ఎంఈఓ కృష్ణయ్య కొనియాడారు. కొత్తకోటకు చెందిన సన్‌రైజర్స్ వాకింగ్ అసోషియేషన్ ఏర్పాటై ఏడాది గడిచిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో చదివే 120 మంది విద్యార్థులకు అసోషియేషన్ వారు గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందిస్తే వారు ఎంతో ఉన్నతికి చేరుకుంటారన్నారు. విద్యార్థుల శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సన్‌రైజర్స్ వాకింగ్ అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పీజే బాబు, ఆకుల వెంకటయ్య, సభ్యులు లాయర్ రాములు, శ్రీనివాసులు, సూర చంద్రశేఖర్, వినోద్‌సాగర్, నరేందర్‌సాగర్, పెంటన్నయాదవ్, సాయిలుయాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సురేందర్‌సింగ్

చిన్నంబావి: వీపనగండ్ల మండల కేంద్రంలో నిర్వహించిన టీఎల్ మేళాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులను పెద్దదగడ సర్పంచ్ సురేందర్ సింగ్ ప్రశంసించారు. బోధనాభ్యాసన సామగ్రి మేళాలో పెద్దదగడకు చెందిన ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిసరాల విజ్ఞానంలో మొదటి స్థానం, తెలుగులో ద్వితీయ స్థానం పొందడంతో సర్పంచ్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో మరింత ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజమన్నార్‌సింగ్, జగన్మోహన్, వెంకటస్వామిరెడ్డి, కృష్ణమూర్తి, మాసంబి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

మదనాపురం: కొత్తకోట, మదనాపురం మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మదనాపురం మండల బీఆర్‌ఎస్ నాయకుడు రవీందర్‌రెడ్డిని గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్యే, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూలబొకే ఇచ్చి అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి గాడీల ప్రశాంత్, టీకే కురుమయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విద్యాభివృద్ధికి కృషి



వనపర్తి టౌన్: అంగన్‌వాడీలో చేర్పించిన పిల్లల నుంచి మొదలుకొని గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులు విద్యలో రాణించేలా తీర్చిదిద్దడమే ఆర్‌డీఎస్ (రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ), ఐఎల్‌పీ లక్ష్యమని ఐఎల్‌పీ ప్రతినిధి రవిమణి అన్నారు. ఆర్‌డీఎస్, ఐఎల్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యలో వెనుకబడిన విద్యార్థుల పురోగతి లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ మేరకు గురువారం ఆర్‌డీఎస్, ఐఎల్‌పీ సంయుక్తంగా చేపడుతున్న పలు కార్యక్రమ వివరాలను జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో వివరించారు. 66 గ్రామాల్లో 113 పాఠశాలలు, 115 అంగన్‌వాడీలు, 59 విలేజ్ లర్నింగ్ సెంటర్స్ లో కేరియర్ గైడెన్స్, ఎంహెచ్‌ఎం, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు టీఎల్‌ఎం తయారీపై ట్రైనింగ్ నిర్వహించి చదువులో వెనుకబడిన విద్యార్థులు శిక్షణ ఇస్తున్నామన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు పోరాటం

ఖిల్లాఘనపురం: ఎన్‌పీఆర్‌డీ ఇండియా మండల సోషల్‌మీడియా కన్వీనర్‌గా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన దివ్యాంగుల జాతీయ హక్కుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తనను ఎంపిక చేశారని శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తనను మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎంపిక ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు రాజు, రాష్ట్ర సోషల్‌మీడియా కన్వీనర్ రామకృష్ణ నమ్మకాన్ని నిలబెడతానన్నారు. శ్రీనివాసులును జిల్లా ప్రధాన కార్యదర్శి నాగయ్య, మండల అధ్యక్షుడు శ్రీనునాయక్, మండల ప్రధాన కార్యదర్శి కుర్మయ్య తదితరులు అభినందించారు.

ఓటరు జాబితా విడుదల

మదనాపురం: మండలంలోని ఓటర్ల తుది జాబితాను గురువారం తహసీల్దార్ నరేందర్ తన కార్యాలయంలో వెల్లడించారు. 2023కు సంబంధించి దేవరకద్ర అసెంబ్లీ నియోజక వర్గంలోని మండలంలో 26 పోలింగ్ కేంద్రాల్లో 9,324 మంది పురుష ఓటర్లు, 9,216 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 18,540 మంది ఓటర్ల జాబితాను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మూడు పోలింగ్ కేంద్రాలైన గోపన్‌పేట, కరివెన ఒకటిలో పురుష ఓటర్లు 849 మంది, మహిళా ఓటర్లు 872 మంది ఉన్నారు. మొత్తం 1,721 మంది ఉన్నారని పేర్కొన్నారు.

కేసీఆర్ కిట్ అందజేత



పెబ్బేరు: పట్టణ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బాలింతలకు గురువారం కేసీఆర్ కిట్లును మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ అందించారు. వైద్యుల సూచనల మేరకు గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాలని ఆమె సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వీలైనంత వరకు సాధారణ కాన్పులు చేయడంతో పాటు కేసీఆర్ కిట్టు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, స్టాఫ్ నర్సు ఊర్మిల, ఏఎస్‌ఎమ్ వెంకటమ్మ, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

వనపర్తి టౌన్: విద్యార్థి దశ నుంచే తోటి వారికి సహాయ పడాలనే తత్వం అలర్చుకోవాలని అఖిల భారత రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఖాజా కుతుబుద్దీన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ సురేష్‌కుమార్ అధ్యక్షతన ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమానికి కుతుబుద్దీన్, డాక్టర్ మురళీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కుటుంబ సభ్యుల వెంట బయటకు వెళ్లినప్పుడు, బస్సులు, రైలులో ప్రయాణించేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ప్రథమ చికిత్స చేసి వారిని కాపాడొచ్చన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ రమణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సత్తార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఆఫీసర్ పోతురాజు శ్రీనివాస్, పుష్ప, శివుడు, రాజేందర్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేలిముద్రల సేకరణ

ఆత్మకూర్: పాత నేరస్తులను గుర్తించడంలో భాగంగా ఆత్మకూర్ ఎస్‌ఐ పుట్ట మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ముమ్మరంగా వేలిముద్రల సేకరణను చేపట్టారు. స్థానిక గాంధీచౌక్‌లో వాహనదారుల లైసెన్స్, ఆర్సీ వివరాలను సేకరించడంతో పాటు వేలిముద్రలను తీసుకున్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు, ఇతర కేసుల్లో ఉన్నవారి వివరాలను వేలిముద్రల సాయంతో గుర్తించవచ్చన్నారు.



'కంటి వెలుగు'లో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

పాన్‌గల్: ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీహెచ్‌సీ అదనపు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కంటి వెలుగుపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకునేలా చూడాలన్నారు. అప్తోమెట్రిస్టులు శారద, అబ్దుల్ తక్వీర్ కంటి వెలుగుపై అవగాహన కల్పించారు. దీంతో పాటు కుష్టు వ్యాధి, నివారణ లక్షణాలపై డిప్యూటీ పారామెడికల్ అధికారి నందీశ్వర్ వివరించారు.

రేషన్ డీలర్లు అధికారుల సూచనలు పాటించాలి

పాన్‌గల్: మండలంలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లు అధికారులు సూచనలు పాటిస్తూ.. వినియోగదారులకు సదుపాయాలను కల్పించాలని తహసీల్దార్ ఏసయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని రేషన్ దుకాణాలను త్వరలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని దీంతో సివిల్ సప్లయ్ అధికారులు సూచించిన విధంగా దుకాణాలల్లో ప్రథమ చికిత్స పెట్టె, అగ్నిమాపక యంత్రం, పక్క భవనం, సీసీటీవీ, తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ఇంటర్‌నెట్ సౌకర్యం, డిజిటల్ చెల్లింపులు, టేబుల్, కుర్చీలు వంటి వసతులు తప్పక కలిగి ఉండాలన్నారు. ఆయా నిబంధనలను పాటించని డీలర్లపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీటీ చక్రపాణి, ఆర్‌ఐ మహేష్, డీలర్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మూడు దూడలు మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన గేదె దూడలు

పాన్‌గల్: కుక్కల దాడిలో మూడు గేదె దూడలు మృతిచెందిన సంఘటన మండలంలోని బండలపల్లిలో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు మద్దిలేటికి గ్రామ సమీపంలో పశువుల పాక ఉంది. పాకలో గేదెలతో పాటు ఉన్న దూడలను కట్టేశాడు. రోజు వారిలాగానే గురువారం ఉదయం పశువుల పాకకు వెళ్లి చూడగా పాకలో ఉన్న మూడు దూడలు కుక్కల దాడిలో చనిపోయినట్లు పేర్కొన్నారు. వీటి విలువ దాదాపుగా రూ.30 వేలు ఉంటుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా తగు చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ పరంగా పరిహారం అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



అంజనేయులుగౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: రాష్ట్ర క్రీడా సంస్థ చైర్మన్‌గా డాక్టర్ ఆంజనేయగౌడ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మండల టీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పూలమాల, శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చెర్మన్ వామన్‌గౌడ్, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి గాడీల ప్రశాంత్, బీఆర్‌ఎస్ నాయకులు వడ్డె రాములు, మహేష్, రవి, కురుమయ్య, కండక్టర్ రాములు, సాయిలు యాదవ్, అశోక్, అజీజ్, సత్యంయాదవ్, ప్రశాంత్, శ్రీకాంత్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: రాష్ట్ర క్రీడల ప్రాధికార సంస్థ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ అంజనేయులుగౌడ్‌కు గురువారం హైదరాబాద్‌లో మండల నాయకులు పూలే బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో క్రీడల అభివృద్ధికి సహకరించాలని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఫోరం రాష్ట్ర నాయకుడు కుర్మన్నయాదవ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, నారాయణయాదవ్, రాములుయాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ముఖ్యం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ తదితరులు

ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని మండల విద్యాధికారి ఉషారాణి అన్నా రు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ టీఎస్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ ద్వారా విద్యా సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కొత్త సంవత్సరంలో మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మండల పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతు ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మామిడిమాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్‌రెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అరుణ, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి నాగేశయ్య, సభ్యులు సరేందర్ రెడ్డి, భానుప్రకాష్, కృష్ణమోహన్, సాయన్న, అక్తర్ పాషా, సంధ్య, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, తాజోద్దీన్, విద్యారాణి, త్రివేణి, హబీబ్ ఉన్నీస, షైని, సంధ్యరాణి, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.